క్లుప్తంగా

రూరల్ ఇన్‌చార్జి ఏడీఏగా కృష్ణ

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి ఏడీఏగా జిల్లా కార్యాలయంలో టెక్నికల్ ఏడీగా పని చేస్తున్న కృష్ణకు బాధ్యతలు ఇచ్చారు. మొన్నటి వరకు రూరల్ ఏడీఏగా కొనసాగిన ప్రదీప్ ఇటీవల సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కృష్ణను ఇన్‌చార్జిగా నియమించారు. రెగ్యులర్ ఏడీఏ వచ్చే వరకు ఆయనే రూరల్ ఏడీఏగా ఉంటారు.

ముప్కాల్ తహసీల్దార్‌గా ముంతాజుద్దీన్



బాల్కొండ: ముప్కాల్ మండల తహసీల్దార్‌గా ముంతాజుద్దీన్ శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన గజానన్ బదిలీపై నిర్మల్ జిల్లాకు వెళ్లారు. ముంతాజుద్దీన్ జగిత్యాల్ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. రెవెన్యూ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.

కమ్మర్‌పల్లి తహసీల్దార్‌గా ప్రసాద్



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి తహసీల్దార్‌గా జి. ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆంజనేయులు ఇటీవల పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జి.ప్రసాద్ ఇక్కడికి బదిలీ అయ్యారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

పోచంపాడ్‌లో హెల్త్ క్యాంపు



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని వడ్డెర కాలనీలో శుక్రవారం పీహెచ్‌సీ పోచంపాడ్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీవాసులకు బీపీ, షుగర్ పరీక్షలను వైద్యాధికారి రాకేశ్ నిర్వహించారు. అనంతరం దోమలు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మలేరియా నివారణ సబ్‌యూనిట్ అధికారి మురళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల గోదాముల తనిఖీ



రుద్రూర్: పొతంగల్ మండలంలోని విశాల సహకార పరపతి సంఘం పరిధిలోని హెగ్డోలి, కల్లూర్, పొతంగల్ గ్రామాల్లోని ఎరువుల గోదాములను శుక్రవారం తహసీల్దార్ గంగాధర్, మండల వ్యవసాయాధికారిణి నిశిత తనిఖీ చేశారు. గోదాముల్లో ఉన్న ఎరువుల నిల్వలు పరిశీలించారు. రైతులకు అవసరమగు ఎరువులు అందుబాటులో ఉంచాలని వారు సూచించారు.

జీలుగ విత్తనాల పంపిణీ



కమ్మర్‌పల్లి: కోనసముందర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చైర్మన్ సామ బాపురెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, డైరెక్టర్లు ఇటుకల శ్రీనివాస్, బద్దం నవీన్, వీడీసీ అధ్యక్షుడు కంతి సాయన్న తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

రుద్రూర్: రాయకూర్ సింగిల్ విండోలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సాయి కృష్ణ తెలిపారు. అవసరమైన రైతులు పట్టాపాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో వచ్చి తీసుకెళ్లాలని కోరారు.

మొక్కల పెంపకంలో అమృత మిత్రలు

నిజామాబాద్ సిటీ: కార్పొరేషన్ పరిధిలో చెరువుల వద్ద మొక్కలు నాటడం, వాటర్ ట్యాంక్‌ల పరిశీలన బాధ్యతలు అమృత మిత్రలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సూచించారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని కాలూరు చెరువు వద్ద ట్రీస్ ఫర్ ఉమెన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాలూరు చెరువు, రామర్తి చెరువు వద్ద అమృత మిత్రలు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌రెడ్డి, ఏఈ పావని, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు రెడీ..!

- పనుల్లో నిమగ్నమైన రైతులు
- ఆర్మూర్ నియోజకవర్గంలో 92 వేల ఎకరాల్లో పంటల సాగు



దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచిన భూమి



నందిపేట మండలం బజార్ కొత్తూర్‌లో మొలకెత్తిన వరినారు

నందిపేట్(ఆర్మూర్): ఆర్మూర్ నియోజకవర్గంలో రైతులు ఖరీఫ్ పనులకు సన్నద్ధమవుతున్నారు. సాగుకు అవసరమయ్యే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రైతులంతా పొలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. పది రోజుల నుంచి దుక్కులు దున్నుతూ పంట భూములను చదును చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులను సమకూర్చుకుంటున్నారు. వరి పంట సాగు చేయడానికి కావాల్సిన నారుమడులను సిద్ధం చేసుకున్నారు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో అన్నదాత వ్యవసాయ పనుల్లో బిజీ అయిపోయారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో సుమారు 92 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అవసరాలకనుగుణంగా విత్తనాలు, ఎరువుల కోసం వ్యవసాయాధికారులు ఉన్నతాధికారులకు నివేదికలను పంపించారు. భూసారం పెంచడానికి భూముల్లో ఎరువులు, నల్లమట్టిని పోసుకుంటున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా చెరువులు, కుంటలు, ఎత్తిపోతల ఆధారంగా పంటలు సాగు చేస్తారు. నందిపేట మండలంలో 11, ఆర్మూర్ మండలంలో మూడు ఎత్తిపోతల ప్రాజెక్టులున్నాయి. వీటి కిందనే ఎక్కువగా సాగు విస్తీర్ణం ఉంది. కాలం అనుకూలంగా ఉండి ఎస్ఆర్ఎస్‌పీ ప్రాజెక్టు పూర్తిగా నిండితే ఆశించిన స్థాయిలో పంటలు సాగవుతాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి భూగర్భ జలాలు పైకి వస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగవుతాయి.

ఆర్మూర్ డివిజన్ స్థాయిలో పంట సాగు వివరాలు (ఎకరాలలో)

వరి	73,196
సోయాబీన్	3,931
పసుపు	2,544
మొక్కజొన్న	10,910
కూరగాయాలు	650
ఆయిల్ ఫాం	387
ఇతర పంటలు	1,200

భూమిని సిద్ధం చేశాం

ఖరీఫ్ పనులు ప్రారంభం కాకముందే ముందస్తుగా ఎరువులను తీసుకున్నాము. భూమిని చదును చేసి సిద్ధంగా ఉంచాం. వరి నారుమడులను సిద్ధం చేసి నారు కూడా పోశాం. సోయా పంటను సాగు చేసేందుకు దుక్కులు దున్ని భూమిని చదును చేసి ఉంచాం. విత్తనాలను, ఎరువులను కొనుగోలు చేశాం.
– గోపు మొగులాజీ, రైతు, బజార్ కొత్తూర్

నివేదికలు పంపించాం

రబీ ముగియడంతో రైతులు రానున్న ఖరీఫ్ సీజన్‌కు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తాము క్షేత్ర స్థాయిలోకి వెళ్లి ఏ నేలలో ఏ పంటలు వేయాలో సలహాలు ఇస్తున్నాం. అవసరమైన విత్తనాలు, ఎరువులు నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. అనని చర్యలు తీసుకుంటున్నాం.
– విజయలక్ష్మి, ఏడీఏ, ఆర్మూర్

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను సన్మానిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్: ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో బోధన్‌లోని విజ్ఞాన్ కోచింగ్ సెంటర్‌కు చెందిన పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చాటారు. గడిచిన ఏప్రిల్ 5న ప్రవేశ పరీక్ష నిర్వహించగా ఫలితాలు వెలువడ్డాయి. శుక్రవారం పట్టణ కేంద్రంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో శాలువా, జ్ఞాపికతో సన్మానించి అభినందించారు. ఈ కోచింగ్ సెంటర్‌కు చెందిన సూదం మయాంక్(పోతంగల్) 6వ తరగతి ప్రవేశ పరీక్షలో 300 మార్కులకుగాను 283 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 361 స్థానంలో నిలిచాడు. రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంక్ పొందాడు. 9వ తరగతి ప్రవేశ పరీక్షలో విద్యార్థులు సూదం మోక్ష, మణికంఠ అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చాటారు. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎం. వివేక్ మాట్లాడుతూ.. తమ వద్ద శిక్షణ పొందిన 23 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, ఇందులో 17 మంది అర్హత సాధించారని తెలిపారు.

మాల మహానాడు మండల కమిటీ ఏర్పాటు



ఎన్నికైన మాల మహానాడు మండల కమిటీ సభ్యులు

మాక్లూర్: మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చొక్కా దేవిదాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మాణిక్‌భండార్ వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో మాల మహానాడు మాక్లూర్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బేగరి రవి, కార్యదర్శిగా నీరడి శంకర్, కోశాధికారిగా డీసీ గంగాధర్, ఉపాధ్యక్షులుగా తిర్మన్‌పల్లి భోజన్న, ఆసది ఒడ్డెన్న, బి.రవిని ఎన్నుకున్నారు. కులస్తులందరి అభిప్రాయం తీసుకుని సంఘ అభివృద్ధికి పాటు పడుతామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, చింతల మోహన్, భోజన్న, రవి, ఎం.గోపాల్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నేత పల్లపు వెంకటేష్

ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఐ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 26 మంది ఆదివాసీలను ఛత్తీస్‌గఢ్‌లో బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం అటవీ సంపదను దోచేందుకు జరుగుతున్న నరహింసను ప్రజాస్వామికవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. నాయకులు టి.భూమన్న, రవి, కుల్దీప్ శర్మ, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

■ నేడు కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

ఆర్మూర్: నియోజకవర్గం పరిధిలో మండల, పట్టణ స్థాయి కాంగ్రెస్ పార్టీ సమావేశాలను శనివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ కుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సమావేశాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హాజరవుతున్నారన్నారు. ఆయన తో పాటు రాష్ట్ర ఎస్టీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఉదయం 9:30 గంటలకు నందిపేట మండల కేంద్రంలో నాగమంతెన మున్నూ రు కాపు సంఘ భవనంలో నందిపేట, డొంకేశ్వర్ మండలాల సమావేశం నిర్వహించనున్నామన్నా రు. ఉదయం 11:30 గంటలకు ఆలూర్ మండల కేంద్రంలోని మల్లయ్య మందిరం సమీపంలోని మాక్లూర్, ఆలూర్ మండలాల సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం 4 గంటలకు ఆ ర్మూర్ పట్టణంలోని సి- కన్వెన్షన్‌లో ఆర్మూర్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నామని తెలిపారు.

■ నేటి నుంచి వేల్పూర్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

వేల్పూర్: వేల్పూర్ మండల పరిధిలోని గ్రామాలలో శనివారం నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి శృతి శుక్రవారం తెలిపారు. 24న ఉదయం 8 గంటలకు పడగల్ ప్రజాభవన్‌లో, 27న ఉదయం 8 గంటలకు అంక్సాపూర్‌లోని రైతు వేదికలో, జూన్ 3న ఉదయం 8 గంటలకు మోతె గ్రామంలోని రైతు వేదికలో అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు.

'ఆపరేషన్ సిందూర్'కు ఉపాధ్యాయుల మద్దతు



మోపాల్ జెడ్పీహెచ్ఎస్‌లో జాతీయ జెండాతో ఎంఈవో, ఉపాధ్యాయులు

మోపాల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా భారత సైనికులకు మోపాల్ మండల ఉపాధ్యాయులు శిక్షణ విరామ సమయంలో గురువారం సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా మోపాల్ జెడ్పీహెచ్ఎస్‌లో జాతీయ జెండా పట్టుకుని పాకిస్తాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా, భారత్‌కు అనుకూలంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఎంఈవో గేమ్‌సింగ్ మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రదాడికి భారత సైన్యం, ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో ప్రతీకారం తీర్చుకుందని వ్యాఖ్యానించారు. టీటీయూ జిల్లా అధ్యక్షుడు లాటికర్ రాము, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి దేవిదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో రికార్డుల తనిఖీ



బోధన్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో శుక్రవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో నియమ నిబంధనలపై అవగాహన కల్పించాలని వారికి సూచించారు. రాజీవ్ యువవికాస్ పథకంలో లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలన్నారు. హరితహారంపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఎంపీడీవోలు బాల గంగాధర్, మధుకర్ పాల్గొన్నారు.

వెకేషన్ బైబిల్ స్కూల్ ప్రారంభం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని సీఎస్ఐ చర్చి(ఆచన్‌పల్లి)లో శుక్రవారం వెకేషన్ బైబిల్ స్కూల్‌ను చర్చి ఫాదర్ రెవరెండ్ ప్రభాకర్ ప్రారంభించారు. వెకేషన్ బైబిల్ స్కూల్ రెండు రోజులపాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని ఫాదర్ తెలిపారు. ఈ స్కూల్‌లో పిల్లలకు బైబిల్‌లోని ఏసు బోధనలు నేర్పించడంతో పాటు ఆటలు, పాటలు, వివిధ సాంస్కృతిక కార్యమాలు నేర్పిస్తామని వెల్లడించారు. ఫాదర్ స్టీఫెన్, పాస్టర్ రవి, చర్చి కమిటీ ప్రతినిధులు జ్యోతిరాజ్, ఎడ్వర్డ్, సీమాన్, సంపత్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



బోధన్‌టౌన్(బోధన్): లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్(320ఈ) ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు అవార్డులు అందజేశారు. అవార్డుల కార్యక్రమాన్ని సికింద్రాబాద్‌లోని సమ్మర్ గ్రీన్ రిసార్ట్‌లో రెండు రోజుల పాటు నిర్వహించారు. కార్యక్రమానికి 320ఈ గవర్నర్ అమర్‌నాథ్ హాజరై అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ ప్రతినిధులు ముందుండి సేవలందించడం అభినందనీయమన్నారు. ప్రతినిధులు లక్ష్మణ్, జ్యోతి రాజ్, రవీందర్ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పట్వారీ తులసి కుమార్, నర్సింహ నాయుడు

పెర్కిట్(ఆర్మూర్): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జాతీయ అవార్డు గ్రహీత, ఆర్మూర్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు పట్వారీ తులసి కుమార్ హితవు పలికారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శుక్రవారం ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపకుడు కోటపాటి నర్సింహ నాయుడితో కలిసి తులసి కుమార్ డ్రగ్స్ నియంత్రణ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తులసి కుమార్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసలై ఉజ్వలమైన భవిష్యతును నాశనం చేసుకోవద్దని సూచించారు. నేతలు రుక్మాజి, సురేష్, నరేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి నైపుణ్యాలకు పదును పెట్టాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు



డీఈవో అశోక్‌ను సన్మానిస్తున్న ఎంఈవో నరేందర్, ఉపాధ్యాయులు

బోధన్: ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాలకు పదును పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషట్ అధ్యక్షుడు ఎంబెల్లి శంకర్, ప్రతినిధులు ఖైరాన్, గంగాధర్ సూచించారు. పట్టణ కేంద్రంలోని రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ)లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణలో భాగంగా స్థానిక తేజ క్రియేటివ్ కిడ్స్ డ్రాయింగ్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్‌లో తర్ఫీదు ఇచ్చారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్ ఆవరణలో విద్యార్థులకు ఉపాధ్యాయ నేతలు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకునేందుకు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అకాడమీ డైరెక్టర్ లింబూరి లక్ష్మణ్, డ్రాయింగ్ బోధకులు ఎర్రోల్ల అవంతి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి

పెర్కిట్(ఆర్మూర్): ఉపాధ్యాయులు విద్యార్థుల్లో గణిత శాస్త్రంతో పాటు భాషా సామర్థ్యాలను పెంపొందించాలని డీఈవో అశోక్ కుమార్ అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్తిపరమైన శిక్షణ తరగతులను డీఈవో శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడం ద్వారా బోధన సులువవుతుందన్నారు. అనంతరం డీఈవో అశోక్‌ను ఎంఈవో నరేందర్, ఉపాధ్యాయులు సన్మానించారు.

పనిని బట్టి బిల్లులు చెల్లిస్తాం



సత్యనారాయణపురంలో ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డీఎల్‌పీవో నాగరాజు

వర్ని: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జరిగిన పనిని బట్టి బిల్లులు చెల్లిస్తామని బోధన్ డివిజినల్ పంచాయతీ అధికారి నాగరాజు వెల్లడించారు. శుక్రవారం వర్ని మండలం సత్యనారాయణపురంలో, మోస్రా మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. పనులు పూర్తయిన తర్వాత వాటికి సంబంధించిన ఫొటోలను సంబంధిత అధికారులకు అందజేస్తే వాటి ప్రకారం బిల్లులను ఇస్తామన్నారు. ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాలని సూచించారు. వర్ని ఎంపీవో మారుతి, పంచాయతీ కార్యదర్శి సాయిలు పాల్గొన్నారు.

ముప్కాల్ మండలం నల్లూర్‌లో..

బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో నరేష్ ఆనంద్ భూమి పూజ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నల్లూర్‌లో భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని మానాల దేగావత్ తండా(రాజన్నసిరిసిల్ల జిల్లా)లో శుక్రవారం శ్రీజగదాంబ మాత, సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. వేదపండితులు నుంచి ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో మానాల గ్రామంతో పాటు, చుట్టూ ఉన్న తండాల్లో అనేక అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ఇకముందు కూడా ఏ అవసరం వచ్చినా చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. జగదాంబ మాత, సంత్ సేవాలాల్ దీవెనలు రాష్ట్ర ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.

అన్నదాతలు ఆందోళన చెందొద్దు



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న సునీల్‌రెడ్డి

బాల్కొండ: వర్షాల వల్ల ధాన్యం తడిసిన అన్నదాతలు ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండలం నల్లూర్‌లో వర్షాల వల్ల తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలన్నారు. తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఇది వరకే జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిందన్నారు. రైతుల విషయంలో రాజకీయాలు తగవన్నారు. కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య, తదితరులున్నారు.

మారుతి మందిర్ దుకాణాల లీజ్‌కు వేలంపాట



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

బోధన్‌రూరల్: పట్టణంలోని మారుతి మందిర్ కాంప్లెక్స్‌లో గల దుకాణాల లీజ్‌కు దేవదాయ ధర్మదాయ శాఖ. ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. మారుతి మందిర్ కాంప్లెక్స్‌లోని రెండు దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు వేలంపాట నిర్వహించగా 5వ నెంబర్ దుకాణాన్ని కాళిదాసుబారి రూ.7,100లు, 6వ నెంబర్ దుకాణాన్ని బొప్పాపురం హన్మాండ్లు రూ.7,200లు నెలవారీ అద్దెతో అత్యధికంగా వేలంపాట ద్వారా దక్కించుకున్నట్లు ఈవో రాములు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ గుండెటి శంకర్, ఇన్‌స్పెక్టర్ కమల, ఈవో రాములు, పట్టణాభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాధర్ పట్వారి, అర్చకులు ప్రవీణ్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 సింగిల్(తెలుగు)-10.45, 1.30, 7.45
మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-4.15, 10.30

స్క్రీన్-4 శుభం(తెలుగు)-10.50, 7.55
ఏస్(తెలుగు)-1.30, 10.35
హిట్(తెలుగు)-4.40

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,600	వెండి(కిలో)	1,02,500
22 క్యారెట్స్	90,095		

– నిజామాబాద్ బిజినెస్